క్లుప్తంగా

ఐక్యవేదిక అధ్యక్షుడిగా జయరాం

కడప సెవెన్‌రోడ్స్ : జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక పార్టీ కడప నగర అధ్యక్షులుగా మాసాపేటకు చెందిన గున్నా జయరాంను నియమించినట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి తమ పార్టీకి సంబంధించి వార్డు, గ్రామ, మండల కమిటీలు ఏర్పాటు చేయాలని, ప్రజా సమస్యలపై స్పందించి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. ఆ నివేదికలను రాష్ట్ర, కేంద్ర కమిటీలకు పంపాలని నిర్దేశిస్తూ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఆర్‌జేడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ వ్యాప్తంగా గుర్తింపులేని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీష్, రాయలసీమ అధ్యక్షుడు నాగరాజ్‌లు కోరారు. ఈ విషయమై శుక్రవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 25 శాతం సీట్లను ఇవ్వాలని జీఓ ఉన్నా కొన్ని విద్యాసంస్థలు పట్టించుకోవడం లేదన్నారు. కొన్ని పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజు పేరుతో రూ.3 వేల నుంచి రూ.5 వేలు రాబడుతున్నారన్నారు. వీటిన్నింటిపై విచారణ జరిగి చర్యలు తీసుకోవాలని కోరారు.

'కందికుంట'కు మంత్రి పదవి ఇవ్వాలి

కడప రూరల్ : కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌కు మంత్రి పదవి కేటాయించాలని తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కదిరి ఎమ్మెల్యేగా గెలుపొందిన కందికుంట వెంకట ప్రసాద్‌కు చేనేత ముద్దుబిడ్డగా పేరుందన్నారు. చేనేత కార్మికుల సాదక బాధకాలు తెలుసని తెలిపారు. అలాంటి వ్యక్తికి చేనేత జౌళిశాఖను కేటాయించాలని కోరారు. నగర అధ్యక్షులు కల్యా సుధాకర్, సుదర్శన్, బండి కృష్ణయ్య, బొలిశెట్టి వెంకటస్వామి, సానా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు

కడప రూరల్ : కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర సహాయ అధ్యక్షులు దస్తగిరిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగులకు సంబంధించి 1వ తేదీనే జీతాలు అందజేయాలన్నారు. అలాగే సీపీఎస్‌ను రద్దు చేయాలని తెలిపారు. డీఏ, అరియర్స్, సరెండర్ లీవ్స్‌తోపాటు 12వ పీఆర్సీని అమలు చేయడంతోపాటు ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్‌యాదవ్, జిల్లా నాయకుడు పి.తిమ్మారెడ్డి, నిత్యపూజయ్య, టి.శ్రీనివాసులు, బ్రహ్మానందరెడ్డి, రాజశేఖర్, బాల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యార్థులకు ఇంటాక్ 'రీజినల్' బహుమతులు



విజేతల వివరాలను ప్రకటిస్తున్న చిన్నపరెడ్డి

కడప కల్చరల్ : జిల్లా విద్యార్థులకు ఇంటాక్ రీజినల్ స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖన పోటీలో బహుమతులు లభించాయని సంస్థ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. ఇటీవల ఢిల్లీలోని ఇంటాక్ కేంద్ర కార్యాలయం 'మై మాన్యుమెంట్ సెర్చ్' పేరిట విద్యార్థులకు ఈ పోటీ నిర్వహించిందన్నారు. దేశ వ్యాప్తంగా వంద నగరాల్లో ఈ పోటీకి 12 వేల మంది హాజరయ్యారన్నారు. కడపలో జరిగిన పోటీలో 110 మంది పాల్గొన్నారని, ఇందులో నగరానికి చెందిన విద్యామందిర్ ఇంగ్లీషు మీడియం హైస్కూలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఆర్.మహాలక్ష్మి, 9వ తరగతి విద్యార్థి బి.దీక్షిత, స్థానిక బాల వికాస్ ఇంగ్లీషు మీడియం హైస్కూలుకు చెందిన 7వ తరగతి విద్యార్థి ఎస్.జియోన్ ప్రణుతి రీజినల్ స్థాయి బహుమతి సాధించినట్లు తెలిపారు. వారం రోజుల్లో ఆయా పాఠశాలల్లో విజేతలకు ఈ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

వర్షపునీరు రోడ్లపై నిలవకుండా చర్యలు

కడప కార్పొరేషన్: వర్షపునీరు రోడ్లపై నిలవకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మార్నింగ్ విజిట్‌లో భాగంగా పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. 23వ డివిజన్ నాగరాజుపేట సచివాలయంలో పారిశుద్ధ్య కార్మికుల హాజరును స్వయంగా పరిశీలించారు. కార్మికులంతా నూతనంగా ఇచ్చిన యూనిఫారం ధరించాలని సూచించారు. గురువారం రాత్రి నుంచి వర్షం కురుస్తున్న నేపథ్యంలో రహదారులపై నీటి నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాయల్ థియేటర్ వద్దనున్న గార్బేజ్ పాయింట్లను తొలగించాలని సూచించారు. అనంతరం జువెనైల్ హోంను సందర్శించిన కమిషనర్ టాయిలెట్స్‌ను పరిశీలించి పాడైపోయిన కుళాయిలను వెంటనే మార్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హోంలోని పిల్లలకు సంబంధించి అవసరమగు వసతులను ఎప్పటికప్పుడు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని డివిజన్లలో కాలువల్లో ఫాగింగ్ తో పాటుగా అబేట్ స్ప్రేయింగ్ చేయించాలన్నారు. 35వ డివిజన్ నకాష్‌లో కాలువ ఓవర్ ఫ్లో అవుతుండటాన్ని పరిశీలించి, పూడిక తీయించాలని ఆదేశించారు. అడ్డుగా ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలన్నారు. 50వ డివిజన్ దండు ప్రాంతంలో పిచ్చి మొక్కలను, రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ స్ట్రీట్ ఎంట్రెన్స్‌లో కాలువలో ఉన్న మట్టిని తొలగించాలన్నారు. అనంతరం సీకే దిన్నె పరిధిలోని గోశాలను పరిశీలించి మేత కొరకు ఆవులను బయటికి తీసుకుపోవాలన్నారు. గోశాల వనం చుట్టూ రాళ్లతో పాత్ వే నిర్మించి, చెరువులాగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక ఇంజినీరింగ్, శానిటేషన్, ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.



మార్నింగ్ విజిట్‌లో అధికారులతో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్

కడప ప్రజల రుణం తీర్చుకుంటా

– ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప రూరల్ : కడప నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ప్రజల రుణాన్ని తీర్చుకుంటానని ఎమ్మెల్యే మాధవీరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కడప నగర ప్రజలు ఎన్నికల్లో తనకు విజయాన్ని చేకూర్చడాన్ని ఎన్నటికీ మరువలేమన్నారు. వారి రుణాన్ని తీర్చుకుంటానని తెలిపారు. కడప నగర సమస్యలపై పూర్తిగా దృష్టి సారిస్తామన్నారు. అందుకోసం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కడప నగరాభివృద్ధికి సొంతంగా ఒక మ్యానిఫెస్టోను రూపొందించామన్నారు. దాని ప్రకారం నగర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మంచినీరు, ఇతరమౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం కడప నగరంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే అంజద్‌బాష కోట్లాది రూపాయలతో కడప నగరాభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. దీనిపై చర్చించేందుకు తాను సిద్ధమని చెప్పారు.

ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు

కడప ఎమ్మెల్యేగా మాధవీరెడ్డి గెలుపు సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలు ఎన్టీఆర్ సర్కిల్‌లో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాధవీరెడ్డి .. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి

మెస్ చార్జీలను విడుదల చేయించాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ కోరారు. ఈ విషయమై శుక్రవారం నూతనంగా ఎన్నికైన కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు ఇస్తున్న కాస్మోటిక్ మెస్ చార్జీలను పెంచాలన్నారు. అదే విధంగా 9 నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ అన్నమయ్య జిల్లా నాయకుడు స్వరూప్, తేజ, విగ్నేష్, చాంద్‌బాష పాల్గొన్నారు.

మెగా డీఎస్సీపై మొదటి సంతకం హామీని నిలబెట్టుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు కాబోతున్న ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ పై మొదటి సంతకం చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం వారు మాట్లాడారు. నూతనంగా ఏర్పడబోయే ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకుల పక్షాన నిలబడాలని, ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో నాయకులు అంజి పాల్గొన్నారు.

యువత పాలకులను మేల్కొలపాలి

కడప రూరల్ : యువత పాలకులను మేల్కొలిపేలా పోరాటాలు సాగించాలని కేజీటు పీజీ విద్యా సంస్థల అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ లెక్కల జోగిరామిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ప్రోగ్రెసివ్ రెవల్యూషనరీ విద్యార్థి, యువజన సంఘం (పీఆర్ఎస్‌వైఎఫ్) ఆవిర్భావ సభ సందర్భంగా లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత నిరుద్యోగంతోపాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. అలాగే పాలకులను మేల్కొల్పేలా రాజీలేని పోరాటాలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కన్నెలూరు శంకర్, ఓరుగంటి నాగేంద్రబాబు, వెంకటరమణ, వెంకటేశ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరాలు విద్యార్థులకు వరం



ప్రశంసాపత్రాలు అందుకున్న చిన్నారులతో నిర్వాహకులు

కడప కల్చరల్ : వేసవి శిక్షణా శిబిరాలు విద్యార్థులకు వరం లాంటివని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్.అమీరుద్దీన్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో వేసవి సెలవులను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ గ్రంథాలయాలలో శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల ముగింపు సందర్భంగా శుక్రవారం కడప నగరం కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ ప్రధాన కార్యాలయంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అమీరుద్దీన్ మాట్లాడుతూ ఈ శిబిరం విజయవంతం అయ్యేందుకు రీసోర్స్ పర్సన్లుగా వ్యవహరించిన జన విజ్ఞాన వేదిక నాయకులు, గ్రంథాలయ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ శిబిరాల ప్రయోజనం, విలువ గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన శిబిరంలో చిన్నారుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. జేవీవీ సాంస్కృతిక విభాగం ప్రతినిధి రంగనాయకులు లలిత గీతాల ద్వారా శాస్త్ర విజ్ఞానం గురించి తెలియజేయగా, సుబ్రమణ్యం గణితం విలువ, గణితాన్ని సులభంగా నేర్చుకోవడాన్ని గురించి వివరించారు. జేవీవీ జిల్లా ఆర్థిక కార్యదర్శి సమీర్ పలు మేజిక్ అంశాలను ప్రదర్శించారు. శిక్షణా శిబిరంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు గ్రంథాలయంలో ఉచితంగా సభ్యత్వం ఇవ్వడంతోపాటు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు శిక్షణలో నేర్చుకున్న సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. చిత్రలేఖన ఉపాధ్యాయులు శ్రీనివాసులు, గ్రంథాలయ అధికారులు పవన్‌కుమార్, నాదెండ్ల బాబ్జి, జేమ్స్, సురేష్, సుబ్రమణ్యం, రాంప్రతాప్ పాల్గొన్నారు.

ప్రజలు శాంతియుతంగా జీవించేందుకు కృషి చేయాలి

కడప అర్బన్: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరువాత ప్రజలు శాంతియుతంగా జీవించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలనీ కడప ఒన్‌టౌన్ సీఐ సి. భాస్కర్‌రెడ్డి తెలియజేశారు. శుక్రవారం సాయంత్రం కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శాంతి సంఘం నాయకులతో సీఐ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కడప నగరంలో ప్రజలు ఎలాంటి మతపరమైన విద్వేషాలకు గురికాకుండా, అల్లర్లకు తావీయకుండా శాంతియుత వాతావరణంలో జీవించేందుకు వివిధ మతాల పెద్దలు తమ వంతుగా ప్రజలకు ఉద్బోధ చేయాలనీ సీఐ సూచించారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడటానికి ప్రయత్నించినా, ప్రజల శాంతి యుత జీవనానికి భంగం వాటిల్లేలా కుట్రలు పన్నినా అలాంటి వారి సమాచారం తమ దృష్టికి తీసుకుని రావాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామనీ సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రంగస్వామి, మధుసూదన్‌రెడ్డి, శాంతి సంఘం నాయకులు అమీర్‌బాబు, నజీర్ అహ్మద్, సలావుద్దీన్, షామీర్, భాస్కర్‌రెడ్డి, అబ్రహాం, విజయ్ భట్టర్ తదితరులు పాల్గొన్నారు.



శాంతి సంఘం నాయకులతో మాట్లాడుతున్న సీఐ భాస్కర్‌రెడ్డి


విద్యారంగ అభివృద్ధికి చేయూత ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడే ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధితోపాటు విద్యా పరిరక్షణకు కృషి చేయాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. శుక్రవారం కడపలోని ఎస్‌టీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ ప్రకటిస్తూ మొదటి సంతకాన్ని చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 28 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జీవో 117 కారణంగా రాష్ట్రంలో 12 వేల పాఠశాలల్లో సింగిల్ టీచర్ స్కూల్గా మారిపోయినందున విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఉన్నత పాఠశాలలో తగినంత మంది సబ్జెక్టు టీచర్లు ఉండే విధంగా తగు నిర్ణయం ప్రకటించాలని కోరారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఒకే పాఠశాలగా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా మెరుగైన పీఆర్సీ, ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. రాష్ట్రమంతా విద్యార్థులకు ఒకే సిలబస్ ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుపాకుల మురళి, జిల్లా గౌరవ అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, కొప్పూరి నాగరాజు, శ్రీరాములు, సలాంతోపాటు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో భద్రకాళికి రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి



రాహుకాల పూజల్లో పాల్గొన్న మహిళలు

రాయచోటి టౌన్ : పట్టణంలో వెలసిన భద్రకాళి అమ్మవారికి భక్తి శ్రద్ధలతో నిర్వహించిన రాహుకాల పూజల్లో మహిళలు పాల్గొన్నారు. శుక్రవారం అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించిన తరువాత పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయలతో హారాలతో అలంకరించారు. అనంతరం మహిళలు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. అనంతరం భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం రాహుకాల పూజ విశిష్టతను వివరించి తీర్థప్రసాదాలు పంచారు. ఈ కార్యక్రమం ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. వీరభద్రుడి దర్శనార్థం పెద్దసంఖ్యలో కన్నడ భక్తులు ఆలయానికి వచ్చారు.

ముగిసిన గ్రంథాలయ వేసవి శిబిరాలు

వేంపల్లె : మే 15 నుంచి జూన్ 7వ తేదీ వరకు గ్రంథాలయ వేసవి శిబిరాలు నిర్వహించినట్లు వేంపల్లె శాఖ గ్రంథాలయ అధికారిణి వనజకుమారి తెలిపారు. శుక్రవారం ముగింపు సందర్భంగా విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. వేసవికాలంలో విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్లు చూడకుండా గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేస్తే మంచి జ్ఞానాన్ని పొందవచ్చన్నారు. వివిధ రకాల కాంపిటీషన్ పరీక్షలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వేసవి శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక సమీక్ష, పుస్తక పఠనం, వక్తృత్వ పోటీలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈఓ వెంకటసుబ్బారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డిల చేతుల మీదుగా విజేతలుగా నిలిచిని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగులు ధర్మారెడ్డి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న వెంకటసుబ్బారెడ్డి, వెంకటరామిరెడ్డిలు

పుష్పగిరి క్షేత్రాన్ని దర్శించుకున్న ఆర్‌డీఓ

వల్లూరు : మండలంలోని పుష్పగిరి క్షేత్రాన్ని కడప ఆర్‌డీఓ మధుసూదన్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయన రాకను పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షిత్ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆర్‌డీఓకు పూజా కైంకర్యం నిర్వహించారు. అలాగే దక్షిణ కాశీగా పిలవబడుతున్న పుష్పగిరి క్షేత్రం గురించి, అలాగే అందులో వెలసి ఉన్న స్వాముల వారి గురించి ఆర్‌డీఓకు అర్చకులు తెలియజేశారు. అనంతరం ఆర్‌డీఓకు శాలువ కప్పి, పూల మాలతో సత్కరించారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఆర్‌డీఓ మధుసూదన్

చట్ట వ్యతిరేక పనులు చేస్తే చర్యలు తప్పవు

సిద్దవటం : ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దవటం ఎస్ఐ పెద్ద ఓబన్న హెచ్చరించారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లె, సిద్దవటం గ్రామాలోని ప్రజలకు శుక్రవారం ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదన్నారు. గొడవలు సృష్టించవద్దన్నారు.



ప్రజలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ ఓబన్న

ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులో వెల్లడించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలల్లో ఫీజులకు సంబంధించిన వివరాలను నోటీసు బోర్డులో ఏర్పాటు చేయాలని పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం కడపలోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, కార్పోరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను వసూలు చేస్తున్నారని వాటని అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు నిర్వహించి అధిక ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు. అలాగే ప్రతి పాఠశాలలో బుక్ స్టోర్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు పుస్తకాలను విక్రయిస్తూ డబ్బులను దండుకుంటున్నారన్నారు. జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలల వివరాలను తక్షణం వెల్లడించాలని డిమాండ్ చేశారు. అనుమతి లేని పాఠశలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌యూ నాయకులు గోపి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బలిజలకు మంత్రి పదవులు కేటాయించాలి



మాట్లాడుతున్న బలిజ సేన రాష్ట్ర కార్యదర్శి ఎస్వీ రమణ

కడప రూరల్ : రాష్ట్రంలో ఏర్పాటు కానున్న తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి మంత్రివర్గంలో బలిజలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని బలిజ సేన రాష్ట్ర కార్యదర్శి ఎస్వీ రమణ అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమలో మెజార్టీ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవడంలో పవన్ కల్యాణ్, బలిజలు పెద్దన్న పాత్ర పోషించారని అన్నారు. ఈ నేపథ్యంలో బలిజలకు రాజకీయంగా అధిక ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు మంత్రి పదవులను కేటాయించాలన్నారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు మురళీకృష్ణ, కేఎస్‌నరసింహా, రాష్ట్ర మహిళా కార్యదర్శి రెడ్డి రాణి, అనంతరాయలు, సుంకర రవిచంద్ర పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని లోహియా నగర్ యానాదికాలనీ రాముని ఆలయం వద్ద డ్రైనేజీ కాలువలతో స్థానికులకు తిప్పలు తప్పడం లేదు. ఈ ప్రాంతంలోని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం, అక్కడక్కడా డ్రైనేజీపై బండలు లేకపోవడంతో చిన్నారులు పలుమార్లు డ్రైనేజీ గుంతల్లో పడిన ఘటనలు ఉన్నాయి. రోడ్డు, డ్రైనేజీ దుస్థితి కారణంగా అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనం, ఆటోలు వచ్చేందుకు కూడా వీలు లేకుండా ఉంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ సమస్యతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.